సాక్షి నిజామాబాద్

ఆదివారం । 17 । ఆగస్టు । 2025





నగరంలోని మారుతీనగర్ ఆలయంలో కృష్ణుడి విగ్రహం, గీతాభవన్‌లో పూజల్లో పాల్గొన్న భక్తులు

కృష్ణం వందే జగద్గురుమ్

శ్రీ కృష్ణాష్టమి వేడుకలను జిల్లా వ్యాప్తంగా శనివారం కనుల పండువగా నిర్వహించారు. కృష్ణ మందిరాలలో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు అలరించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో యువకులు ఉత్సాహంగా ఉట్టి కొట్టారు.

న్యూస్‌రీల్

ఏడు కొండలను కాపాడుకోవాలి



మాక్లూర్: వేదకాలం నాటి శ్రీవారి ఏడు కొండలను కాపాడుకోవాల్సిన బాధ్యత హిందువులపై ఉందని మధుర భారతి బిరుదాంకితులు, ఉభయ వేదాంత డాక్టర్ వోలేటి రవి కుమారాచార్య స్వామి అన్నారు. మండలంలోని గుత్ప చౌరస్తా వద్దగల అపురూప వేంకటేశ్వర ఆలయంలో శనివారం ఆయన వేంకటేశ్వరస్వామి విశేష ప్రవచనాలు వినిపించారు. సనాతన ధర్మ పరిరక్షణకు ఆలయాలు కేంద్రస్థానాలని తెలిపారు. ఇతిహాస పురాణాలలో చెప్పబడిన ధర్మాలను తెలుసుకుని ఆరోగ్యకరమైన సామాజిక కుటుంబ జీవనం సాగించాలన్నారు. ధర్మమార్గంలో నడుస్తూ న్యాయంగా సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం శ్రీకృష్ణ జన్మాష్టమి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ సేనాపతి వెంకట కుమారస్వామి, ఆలయ చైర్‌పర్సన్ అమృతలత, సురేందర్‌రెడ్డి భక్తులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



నిజామాబాద్‌నాగారం: ప్రతి వ్యక్తి రోజు 40 నిమిషాల పాటు యోగా చేయడంతో మంచి ఆరోగ్యం పొందవచ్చని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. ఇటీవల రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని నగరంలోని దయానంద యోగా కేంద్రంలో ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. ప్రస్తుతం యోగా అనేది ప్రతి ఒకరిలో భాగమైందని అన్నారు. అనంతరం యోగా పోటీల్లో విజేతలుగా నిలిచిన బి.పద్మ, కృష్ణవేణి, ఆర్.ప్రియాంక, డి.ప్రియాంక, నిత్య, రిత్విక, అబ్బాయ్యను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు యోగ రామచందర్, అధ్యక్షుడు యోగారత్న ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి టి.బాల శేఖర్, కార్యనిర్వాహక కార్యదర్శి జి.సంగీత, కోశాధికారి ఎం. భూమాగౌడ్, సంయుక్త కార్యదర్శి ఎం. రఘువీర్, శ్రీనివాస్, కార్పొరేటర్ శ్రీధర్, ప్రభాకర్, యోగా శిక్షకులు, సాధకులు పాల్గొన్నారు.

'మహాలక్ష్మి'తో ఆర్టీసీకి ఆదాయం



బాన్సువాడ : మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి భారీగా ఆదాయం సమకూరుతోందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం బాన్సువాడ బస్‌డిపోకు వచ్చిన రెండు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటి నిజామాబాద్ నుంచి జహీరాబాద్‌కు(వయా బోధన్, బాన్సువాడ, నిజాంసాగర్), మరొకటి బాన్సువాడ నుంచి నారాయణ్‌ఖేడ్ (వయా పిట్లం, నిజాంపేట్) నడుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం సరితాదేవి, బీర్కూర్ ఏఎంసీ చైర్మన్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

'సాగర్'కు 35,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: మెదక్, సంగారెడ్డి జిల్లాలతో పాటు జిల్లాలో కురుస్తున్న వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీటి ప్రవాహం పెరిగింది. పోచారం ప్రాజెక్టు పొంగి పొర్లుతుండడంతో శనివారం 10 వేల క్యూసెక్కుల నీరు నిజాంసాగర్‌లోకి వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఘనపురం ఆనకట్ట, హల్దీవాగు, సింగూరు ప్రాజెక్టు ద్వారా 25,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1,398.08 అడుగుల (9.407 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

సింగూర్ ప్రాజెక్టు 5 గేట్లు ఎత్తివేత

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సంగారెడ్డి జిల్లాలోని సింగూర్ ప్రాజెక్టులోని శనివారం 31 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఎగువ నుంచి వరద నీరు ఉధృతంగా వస్తుండడంతో సింగూరు ప్రాజెక్టు 5 గేట్ల ఎత్తివేసి 45 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ఈ నీరు నిజాంసాగర్ ప్రాజెక్టును చేరనుంది.



నిజాంసాగర్ ప్రాజెక్టు

గూండ్ల వాగును పరిశీలించిన సీపీ



రుద్రూర్: భారీ వర్షాలు కురుస్తున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సాయి చైతన్య సూచించారు. రుద్రూర్ మండలంలోని బొప్పాపూర్-రుద్రూర్ రహదారి పైనుంచి ప్రవహిస్తున్న గూండ్ల వాగు ఉధృతిని ఆయన శనివారం పరిశీలించారు. లోలెవల్ వంతెన పైనుండి వరద ప్రవహిస్తున్నందున ప్రజలెవరూ రోడ్డు దాటేందుకు ప్రయత్నించొద్దన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. సీపీ వెంట బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ కృష్ణ, ఎస్సై సాయన్న ఉన్నారు.



వేల్పూర్ మండలంలోని జాన్కంపేట్ పెద్దవాగు చెక్‌డ్యాం వద్ద వర్షపు నీరు

ఆలస్యమైనా ఆశలు నింపిన వాన

- సాగు, తాగునీటికి ఢోకా లేదిక
- నిండుతున్న ప్రాజెక్టులు, చెరువులు
- పారుతున్న అలుగులు, వాగులు
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు ఆశలు నింపాయి. మొన్నటి వరకు అంతంత మాత్రమే పడడంతో సాగు, తాగునీటిపై కొంత భయం ఉండేది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఆ ఆందోళన అక్కర్లేదనే నమ్మకం ఏర్పడింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఆగకుండా కురిసిన వర్షంతో జిల్లా వ్యాప్తంగా మెరుగైన వర్షపాతం నమోదైంది. ప్రాజెక్టుల్లోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. చెరువులు, కుంటలు నిండుతున్నాయి. పలుచోట్ల అలుగులు, వాగులు పారుతున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో నీటి నిల్వ 55 టీఎంసీలు దాటింది. సగం చెరువులు నిండేస్థాయికి చేరుకోవడంతో సాగు, తాగునీటికి ఢోకా లేదని చెప్పవచ్చు. ఇటు భూగర్భజలాల పెరుగుదలకు వర్షాలు దోహదపడుతున్నాయి. వర్షాధార పంటలకూ మేలు జరుగుతోంది. ఐతే, వాతావరణ శాఖ చెప్పిన దాని కంటే ఆలస్యంగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. అంచనాలు అదుపు తప్పడంతో వర్షం ఎప్పుడెలా వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. శనివారం ఉదయం 8గంటల వరకు వర్షపాతం జిల్లా వ్యాప్తంగా 2సెంటీమీటర్లు నమోదు కాగా, రోజంతా కురిసిన వానకు మరింత వర్షపాతం రికార్డు కానుంది. ఇందల్వాయి మండలం సిర్నాపల్లి వాగు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామానికి రాకపోకలు నిలిచాయి. రుద్రూర్ మండలం బొప్పాపూర్ వద్ద రోడ్డుపై గుండ్ల వాగు ప్రవహిస్తోంది. జిల్లాకు వర్షసూచన ఇంకా ఉన్నందున ప్రజలు వరద ప్రవహించే ప్రాంతాలతోపాటు జలపాతాల వద్దకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీచేశారు.

ఇప్పటి వరకు 48 సెంటీమీటర్లు

ఈ ఏడాది వర్షాకాల సీజన్‌లో ఇప్పటి వరకు జిల్లాలో 57 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 48 సెంటీమీటర్లు నమోదైంది. కురుస్తున్న వర్షాలతో మరింత పెరిగే అవకాశముంది. డొంకేశ్వర్, ఇందల్వాయి మండలాలు అధిక వర్షపాతం జాబితాలో ఉండగా, 15 మండలాలు సాధారణ, 16 మండలాలు లోటులో ఉన్నాయి. ఈ కాస్త లోటును పూడ్చేందుకు ఇంకా 40 రోజుల వర్షాకాలం సీజన్ మాత్రమే ఉంది. సెప్టెంబర్ ముగిసే నాటికి జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 90 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదు కావాలి.

కలెక్టర్ పరిశీలన

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శనివారం లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. నిజామాబాద్ నగరంతోపాటు బోధన్ పట్టణం, వర్ని మండలం జలాల్‌పూర్‌లో అధికారులతో కలిసి తిరిగారు.

జిల్లాలో చెరువుల పరిస్థితి..

డివిజన్	చెరువులు	25 శాతం నిండినవి	25-50 శాతం నిండినవి	50-75 శాతం నిండినవి	75-100 శాతం నిండినవి	అలుగు పారుతున్నవి
బోధన్	182	02	21	121	20	18
నిజామాబాద్	324	163	117	29	11	04
ఆర్మూర్	196	47	63	53	27	08
బాల్కొండ	292	79	128	79	06	-
బాన్సువాడ	90	-	16	25	18	31
మొత్తం	1,084	291	345	307	82	61

ఎస్సారెస్పీకి పోటెత్తిన వరద

- లక్షా 5 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- వేగంగా పెరుగుతున్న నీటి మట్టం

బాల్కొండ: స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతోపాటు మహారాష్ట్రలోని ప్రాజెక్టుల నుంచి మిగులు జలాలను వదలడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద పోటెత్తుతోంది. శుక్రవారం రాత్రి వరకు 60 వేల క్యూసెక్కులు వచ్చిన ఇన్‌ఫ్లో, శనివారం ఉదయానికి 90 వేల క్యూసెక్కులకు పెరిగింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి లక్షా 5 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. స్థానిక ఎగువ ప్రాంతాల నుంచి 30 శాతం, మహారాష్ట్రలోని విష్ణుపురి, బాలేగావ్‌ల నుంచి 70 శాతం వరద నీరు వస్తోందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం రాత్రికి 1083.60 (55.62 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 4 వేలు, అలీసాగర్ లిఫ్టు ద్వారా 180, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదలవుతుండగా, ఆవిరి రూపంలో 541 క్యూసెక్కుల నీరు పోతోంది. గతేడాది ఇదే రోజున ప్రాజెక్ట్‌లో 1081.10 (48.07 టీఎంసీలు) నిల్వ ఉంది.

12 గంటల్లో 4 టీఎంసీలు

ఎస్సారెస్పీలోకి శనివారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 12 గంటల వ్యవధిలో 4 టీఎంసీల వరద వచ్చి చేరింది. మధ్యాహ్నం నుంచి వరద లక్షా 5 వేల క్యూసెక్కులు వస్తుండడంతో నీటిమట్టం వేగంగా పెరుగుతోంది.

ఉధృతి పెరిగే అవకాశం

గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సారెస్పీ ఈఈ చక్రపాణి తెలిపారు. శనివారం ఆయన ప్రాజెక్ట్ నీటిమట్టాన్ని పరిశీలించారు. గోదావరిలోకి మత్స్యకారులు, పశువుల కాపర్లు వెళ్లొద్దని సూచించారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు.



ఎస్సారెస్పీలో ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు

బోధన్ డివిజన్‌లో అత్యధిక వర్షపాతం

నిజామాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు వాన జోరు కొనసాగింది. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, డ్రెయినేజీలు వరద నీటితో ఉప్పొంగాయి. వర్షపు నీటితో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించాయి. లోలెవల్ వంతెనల పైనుంచి వరద నీరు పారింది. జిల్లాలోని బోధన్ డివిజన్ పరిధిలో అత్యధిక వర్షపాతం నమోదైంది. కోటగిరి మండలంలో 63.4 మిల్లీమీటర్లు, వర్ని 53.9, మోపాల్ 45.8, రుద్రూర్ 43.1, ఇందల్వాయి 33.1, చందూరులో 32.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 20 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య, అదనపు కలెక్టర్లతోపాటు సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. వాగులు, లోతట్టు ప్రాంతాలను సందర్శించి అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.



బొప్పాపూర్ వాగు ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు

బడాపహాడ్‌కు రాకపోకలు బంద్



జలాల్‌పూర్‌లో అలుగు పైనుంచి ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

వర్ని: వర్ని మండలంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షంతో బడాపహాడ్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. సైదీపూర్ చెరువు అలుగుపారి రోడ్డు పైనుంచి వరద ప్రవహిస్తుండడంతో జలాల్‌పూర్ నుంచి బడాపహాడ్‌కు ప్రయాణించే పరిస్థితి లేదు. మరోవైపు కోకల్‌దాస్ తండా వద్ద వాగు పైనుంచి వరద ఉధృతంగా ప్రవహించడంతో మొండిసడక్ నుంచి బడాపహాడ్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాగులు పొంగి పొర్లడంతో తీవ్ర అంతరాయం ఏర్పడింది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

భారీ వర్షాల నేపథ్యంలో గ్రామ, మండల, డివిజన్ స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. వర్ని మండలంలోని జలాల్‌పూర్ శివారులో ఉన్న సైదీపూర్ చెరువు అలుగులు, కోకల్‌దాస్ తండా శివారులో లోలెవల్ వంతెనను శనివారం ఆయన పరిశీలించారు. భారీ వర్షాల మూలంగా ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు రహదారులను మూసివేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రమాద అవకాశాలు ఉన్న ప్రాంతాల్లో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పహారాకాయాలని, ప్రయాణికులను దారి మళ్లించాలని సూచించారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టుకు భరోసా

- ఎస్సారెస్పీలో 50 టీఎంసీలు దాటిన నీటి నిల్వ

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతుండడంతో ఆయకట్టుకు భరోసా ఏర్పడింది. స్థానిక ఎగువ ప్రాంతాలతోపాటు మహారాష్ట్రలోని ప్రాజెక్టుల నుంచి వరద వస్తోంది. ఎస్సారెస్పీ నీటిమట్టం ప్రస్తుతం 50 టీఎంసీలు దాటింది. దీంతో ఆయకట్టులోని ఖరీఫ్ పంటలకు పూర్తిస్థాయిలో నీరు అందించవచ్చని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కాగా, సీజన్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులతో జలాశయంలోకి ఆశించినంతగా వరద రాలేదు. దీంతో ప్రాజెక్ట్ నుంచి ఖరీఫ్ పంటలకు కాలువల ద్వారా నీటిని విడుదల చేసేందుకు పాలకులు, అధికారులు మల్లగుల్లాలు పడ్డారు. ప్రాజెక్టులో నీటి నిల్వ 40.5 టీఎంసీలకు చేరగానే వరదలు వచ్చే అవకాశం ఉందని భావించి ప్రభుత్వం నీటి విడుదలకు పచ్చజెండా ఊపింది. ఈ నెల 7న అధికారులు నీటి విడుదల చేపట్టారు. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్ట్‌లోకి భారీగా వరద వస్తోంది. ప్రాజెక్ట్‌లో నీటిమట్టం వేగంగా పెరుగుతుండడంతో ఖరీఫ్‌తోపాటు రబీ సాగుపై ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

లక్షల ఎకరాలకు నీరు..

ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువ ద్వారా ఎల్ఎండీ ఎగువ వరకు 4.60 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు అధికారులు నిర్ణయించారు. లక్ష్మీ కాలువ ద్వారా 25 వేలు, సరస్వతి కాలువ ద్వారా 35 వేలు, అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా 57,763, గుత్ప ఎత్తిపోతల ద్వారా 38,967, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల ద్వారా 11,600, వేంపల్లి ఎత్తిపోతల ద్వారా 22 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు.



కోటగిరి శివారులో నీట మునిగిన పంట పొలాలు



సిరికొండ మండలం గడ్కోల్ వద్ద ప్రవహిస్తున్న కప్పల వాగు



పొతంగల్ వద్ద మంజీర నదిలోకి వస్తున్న వరద

విపత్కర పరిస్థితుల్లోనూ వైద్య సేవలందించాలి

- భారీ వర్షాల దృష్ట్యా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి
- డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్



జీజీహెచ్‌లో రోగితో మాట్లాడుతున్న డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్, ఇతర అధికారులు

నిజామాబాద్‌నాగారం: భారీ వర్షాల దృష్ట్యా ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ నరేంద్ర కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమర్జెన్సీ వార్డులో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఫార్మసీ, టీహబ్, ఫీవర్ వార్డు, బ్లడ్ బ్యాంక్ తదితర విభాగాలను సందర్శించి వివరా లు తెలుసుకున్నారు. అనంతరం సూపరింటెండెంట్ చాంబర్‌లో వైద్యులు, అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకునేందుకు సీహెచ్‌సీ, పీహెచ్‌సీలతోపాటు జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేశామన్నారు.

సమన్వయంతో ముందుకు సాగాలి


డెంగీ కేసులు, ఇతర విషజ్వరాలు ఎక్కడైనా ప్రబలితే అవసరమైన ఇతర శాఖల సహాయం తీసుకొని రోగులకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని డీఎంఈ నరేంద్రకుమార్ అన్నారు. ఆయన వెంట తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నాగమోహన్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రాములు, డాక్టర్ సరస్వతి, ఎన్‌హెచ్ఎం రాజు, సర్వేలైన్ అధికారి నాగరాజు, ఇతర వైద్య సిబ్బంది ఉన్నారు. కాగా, తనిఖీల సమయంలో ఔషధాల స్టోర్ రూమ్‌కు తాళం ఉండడంతో అధికారులు అసహనం వ్యక్తం చేశారు.

ఒక్కసారి 100 మంది వచ్చినా..

భారీ వర్షాల నేపథ్యంలో ఒక్కసారిగా 50 నుంచి 100 మంది రోగులు వచ్చినా వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అన్ని మూడు నెలలకు సరిపడా మందులతోపాటు బెడ్స్, వైద్య సిబ్బంది, టెక్నీషియన్స్, ల్యాబుల్లో కెమికల్స్ ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలని పేర్కొన్నారు. వర్షాలతో రవాణా సమస్య ఏర్పడే అవకాశం ఉందని, రెండు వారాలకు సరిపడా నిత్యావసర సరుకులు స్టాక్ పెట్టుకోవాలన్నారు.

కామారెడ్డిలో దంచికొట్టిన వాన

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తుపాను ప్రభావంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. దీంతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు పూర్తిగా నిండి అలుగు పోస్తోంది. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద వస్తోంది. జిల్లా కేంద్రంలోని పెద్ద చెరువు నిండి అలుగు పారుతోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. కొన్ని చోట్ల వర్షంతో పాత ఇళ్లు కూలిపోయాయి. శుక్రవార ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు జిల్లాలో అత్యధికంగా రామారెడ్డిలో 123.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. బీబీపేట, భిక్కనూరు, దోమకొండ, మాచారెడ్డి, పాల్వంచ తదితర మండలాలు మినహా జిల్లాలోని మిగతా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.



అలుగు పోస్తున్న పోచారం ప్రాజెక్టు

క్లుప్తంగా

ఈనెల 19న ఏచూరి సంస్మరణ సభ



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 19న పట్టణ మున్నూరుకాపు సంఘం కల్యాణ మండపంలో సీపీఎం పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేకర్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని పార్టీ కార్యకర్తలు, శాఖ కార్యదర్శులు, సభ్యులు, శ్రేణులు, రైతులు, కార్మికులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకట్ గౌడ్, మొతీరాం నాయక్, కొత్త నర్సింలు, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 16న మిస్టర్ కామారెడ్డి బాడీ బిల్డర్ పోటీలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణంలో నవంబర్ 16న మిస్టర్ కామారెడ్డి బాడీ బిల్డర్ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిమ్ ప్రతినిధులు నవీన్, యాసిన్‌లు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కామారెడ్డి జిమ్ యజమానుల ఆధ్వర్యంలో మొట్టమొదటి సారిగా కామారెడ్డిలో జిల్లా స్థాయి బాడీ బిల్డర్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో ఏడు కేటగిరీలు ఉంటాయని వివరించారు. పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్నవాళ్లు 9848278436 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. జిల్లాలోని బాడీ బిల్డర్స్ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో శివ, లిఖిత్‌గౌడ్, మహిపాల్, రఫీఫ్ రెడ్డి, తేజ, ఎజాజ్, దేవా తదితరులున్నారు.

షెడ్డును ప్రారంభించిన సైంటిస్ట్



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో గల ఆంజనేయ స్వామి ఆలయం ఎదుట గ్రామ పంచాయతీ సమీపంలో దాత అయిన సైంటిస్ట్ హైడి ఎల్లారెడ్డి శనివారం తన సొంత నిధులతో షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పలు గ్రామాల్లో ఇప్పటి వరకు తన వంతుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి





వర్ని మండలంలోని సైదిపూర్ చెరువు అలుగును పరిశీలిస్తున్న సీపీ సాయి చైతన్య.. బోధన్‌లో అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య
- బోధన్ నియోజకవర్గంలో పర్యటన

బోధన్‌టౌన్(బోధన్): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. అధికారులు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణంలోని 24, 35 వార్డుల్లో శనివారం కలెక్టర్ పర్యటించారు. అనిల్ టాకీస్ చౌరస్తాలో శర్భతీ కెనాల్‌పై గల రోడ్డు మరమ్మతులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని, ప్రజల రాకాపోకలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని సిబ్బందికి వెల్లడించారు. సబ్ కలెక్టర్ వికాస్ మహతో, బల్దియా సిబ్బంది ఉన్నారు.

బోధన్‌లోని అనిల్ టాకీస్ చౌరస్తాలో గల శర్భతీ కెనాల్ మరమ్మతులను శనివారం రాత్రి సీపీ సాయిచైతన్య పరిశీలించారు. పనులు పూర్తి చేసే వరకు పోలీసులు, ట్రాఫి క్ పోలీసులు బందోబస్తు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ మళ్లింపుపై ఏసీపీ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. సీఐ వెంకట నారా యణ,ట్రాపిక్ సిఐ చందర్ రాథోడ్ లు ఉన్నారు.

వాగులను దాటొద్దు..

వర్ని: భారీ వర్షాలకు లోలెవల్ వంతెనల మీదుగా వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ఎవరూ వాగుదాటేందుకు ప్రయత్నాలు చేయవద్దని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సాయి చైతన్య ప్రజలకు సూచించారు. వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని జలాల్పూర్ శివారులోని సైదిపూర్ రిజర్వాయర్ (చెరువు) అలుగు, కోకల్‌దాస్ తండా శివారులోని లోలెవల్ వంతెనను సీపీ పరిశీలించారు. గ్రామాల్లో వర్షాల వల్ల కలిగే నష్టాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని గ్రామ స్థాయి అధికారులను ఆదేశించారు. అత్యవసర సమయంలో సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా 100 డయల్ చేయాలని, లేదా పోలీస్ కంట్రోల్ రూం 8712659700 నంబర్‌కు సంప్రదించాలన్నారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రుద్రూర్ సీఐ కృష్ణ, ఎస్సై మహేష్, సాయన్న, ఎంపీడీవో వెంకటేశ్ ఉన్నారు.

గంగరాజు మళ్లీ సెల్‌టవర్ ఎక్కాడు

- తన ఇంటిముందు విద్యుత్‌స్తంభాన్ని ఏర్పాటుచేయాలని డిమాండ్
- గత నెల 19న టవరెక్కినా పరిష్కారం కాని సమస్య

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారెడ్డి గ్రామానికి చెందిన జోడు గంగరాజు అనే యువకుడు శనివారం మరోమారు సెల్‌టవర్ ఎక్కాడు. తన ఇంటిముందు విద్యుత్‌స్తంభం ఏర్పాటు చేసి వీధి దీపం అమర్చాలని డిమాండ్ చేస్తూ అతడు సెల్‌టవర ఎక్కాడు. కాగా గత నెల 19న ఇదే డిమాండ్‌తో ఆయన సెల్‌టవర్ ఎక్కడంతో స్థానిక ఎస్సై భార్గవ్‌గౌడ్, ట్రాన్స్‌కో ఏఈ నాగరాజు ఘటన స్థలానికి చేరుకొని అతడికి నచ్చజెప్పి కిందకు దించారు. కానీ సమస్య పరిష్కారం కాకపోవడంతో శనివారం అతడు మరోమారు సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న ఎస్సై భార్గవ్‌గౌడ్ అక్కడికి చేరుకొని గంగరాజుకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. కానీ అతడు వినిపించుకోకుండా ట్రాన్స్‌కో ఏఈ వచ్చి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీంతో ట్రాన్స్‌కో ఏఈ నాగరాజు గ్రామానికి చేరుకొని గంగరాజు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. స్తంభం ఏర్పాటుకు చర్యలు చేపట్టగా, స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారన్నారు. సమస్య పరిష్కారం కోసం పక్కింటి వారితో మాట్లాడుకోవాలని చెప్పారు. దీంతో గంగరాజు సెల్‌టవర్ దిగి కిందకువచ్చాడు. కాగా రెండు గంటలకుపైగా గంగరాజు సెల్‌టవర్‌పైనే ఉండటంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు.



సెల్‌టవర్‌పై గంగరాజు విన్యాసం

అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి

- డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరేంద్రకుమార్
- డిచ్‌పల్లి సీహెచ్‌సీ తనిఖీ



డిచ్‌పల్లి సీహెచ్‌సీలో రోగితో మాట్లాడుతున్న డీఎంఈ నరేంద్రకుమార్



ఇందల్వాయి పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): సీజనల్ వ్యాధుల నివారణ కోసం అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరేంద్ర కుమార్ సిబ్బందిని ఆదేశించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)ని శనివారం ఆయన తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్‌తో కలిసి సందర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పలకరించి వారికి అందుతున్న వైద్యసేవలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలను అందించి ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రులపై విశ్వాసం పెంపొందేలా కృషి చేయాలని వైద్యులకు వారు సూచించారు. డీఎంహెచ్‌వో రాజశ్రీ, డీసీహెచ్ఎస్ శ్రీనివాస్ ప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, జిల్లా మలేరియా అధికారి తుకారం రాథోడ్, ఎన్‌హెచ్ఎం రాజు, జిల్లా సర్వేలైన్ అధికారి నాగరాజు, సీహెచ్‌సీ వైద్యాధికారులు శివ శంకర్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయిలో..

ఇందల్వాయి: ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్య విదాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ ఎడ్యుకేషన్ నరేంద్ర కుమార్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది సమయానుసారం ప్రజలకు అందుబాటులో ఉండాలని, మందులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలను శుభ్రపర్చాలని సూచించారు. వైద్య సిబ్బంది వెంకటేష్, క్రిస్టినా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిబుట్ట..టన్నుకు 10 వేలు

- ఎకరానికి 6 నుంచి 7 టన్నుల దిగుబడి
- మక్క రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం



బాల్కొండ: మక్క రైతుల పంట పండింది. తక్కువ పెట్టుబడితో లాభాలు గడిస్తున్నారు. ప్రస్తుత సంవత్సరం మక్కకు ధర ఎక్కువగా ఉంటుందని ఆలోచించిన ఆర్మూర్ డివిజన్ రైతులు.. సోయా సాగును తగ్గించి మక్కను ఎక్కువగా సాగు చేశారు. ముందుగా కోతకు వచ్చిన మక్క పచ్చిబుట్టకే అధిక ధర దక్కడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పచ్చి బుట్ట ధర వారం రోజుల క్రితం కిలో రూ.8 పలుకగా, ప్రస్తుతం రూ.10కి పెరిగింది. దీంతో ఎకరానికి రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు ఆదాయం వస్తోందని రైతులు చెబుతున్నారు. మక్క సాగు చేస్తున్నప్పటి నుంచి పచ్చి బుట్టకు ఇంత ధర ఎప్పుడూ పలుకలేదంటున్నారు.

దిగుబడి బాగు..

సాధారణంగా మక్క సాగు చేసే రైతులకు ఎకరానికి రూ.25వేల నుంచి రూ.30వేల వరకు ఖర్చవుతోంది. కానీ, పచ్చిబుట్ట రాగానే మక్క రిక్కుతుండడంతో ఎకరానికి కేవలం రూ.5వేలు మాత్రమే ఖర్చవుతోంది. ఎకరానికి 6 నుంచి 7టన్నులకు తగ్గకుండా దిగుబడి వస్తుండడంతో రూ.70 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు అంటున్నారు. అడవి పందుల నుంచి పంటను కాపాడుకోవడంతోపాటు మంచి ధర పలుకుతుండటంతో రైతులు పచ్చిబుట్ట విక్రయానికే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు.

కంకుల చొప్పున విక్రయం..

రైతుల వద్ద నుంచి కిలోల చొప్పున కొనుగోలు చేస్తున్న వ్యాపారులు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్రలో కంకుల చొప్పున విక్రయిస్తామని తెలుపుతున్నారు. అక్కడ రూ.100కు నాలుగు కంకులు విక్రయిస్తామంటున్నారు. ఇటు రైతులకు, అటు వ్యాపారులకు మక్క పచ్చిబుట్ట ద్వారా మంచి ఆదాయం లభిస్తోంది.

మక్కలు అమ్మినా ఇంత రాదు..



నూర్పిడి చేసి ఆరబెట్టిన మక్కలు అమ్మినా ఇంతా ఆదాయం రాదు. ఈ సంవత్సరం పచ్చిబుట్టకు మంచి ధర లభిస్తోంది. నేను ఎకరం పచ్చిబుట్టను విక్రయించాను. ఆనందంగా ఉంది.

– శ్రీనివాస్, రైతు

‘మహాలక్ష్మి సాయం’ కోసం ఎదురుచూపులు!

- మహిళలకు ప్రతినెల రూ.2500 అందిస్తామని కాంగ్రెస్ హామీ
- ప్రభుత్వం ఏర్పాటైనా ఇప్పటికీ అందని సాయం



మోర్తాడ్(బాల్కొండ): సాధారణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంలోనే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తరువాత కూడా అర్హులైన గృహిణులకు మహాలక్ష్మి పథకం కింద ఆర్థిక చేయూతను అందిస్తామని కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారు. ఆరు గ్యారెంటీలలో భాగంగానే ఈ పథకం అమలు చేస్తామన్నారు. కానీ నెలల గడుస్తున్నా అర్హులైన మహిళలకు ఆర్థిక సాయం అందడం లేదు. దీంతో వారు పథకం అమలు కోసం ఎదురుచూపులు చూడాల్సివస్తోంది.

జారీకాని మార్గదర్శకాలు..

ఆరు గ్యారెంటీల హామీల అమలు కోసం 2024–25 బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ. 53,196 కోట్లను కేటాయించింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి కూడా బడ్జెట్‌లో నిధులను కేటాయించినా మార్గదర్శకాలను జారీ చేయకపోవడంతో మహిళలకు నిరాశనే ఎదురవుతుంది. ఇప్పటికే జిల్లాలో 74,154 మంది వితంతువులు, 10,185 మంది ఒంటరి మహిళలు, 95,453 మంది బీడీ కార్మికులకు ఆసరా ఫించన్‌లు అందుతున్నాయి. ఆసరా పథకం కింద లబ్ధి పొందుతున్న వారికి మహాలక్ష్మి సాయం అందించే అవకాశం లేదు. ఈ సాయం కోసం అందించడానికి లబ్ధిదారులను ఎంపిక చేస్తే జిల్లాలో సుమారు 50వేల మంది లబ్ధి పొందే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రజాపాలనలో భాగంగా ఆసరా పింఛన్‌లను అందుకోని మహిళలు మహాలక్ష్మి సాయం కోసం వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేస్తేనే ప్రతి నెలా సాయం అందుకునేవారి విషయంలో స్పష్టత రానుంది. దీంతోట ప్రభుత్వం ఎప్పుడు సాయం విషయంపై ప్రకటన చేస్తుందోనని మహిళలు నిరీక్షిస్తున్నారు.

మహాలక్ష్మి సంబురాలను నిర్వహించినా..

మహాలక్ష్మి పథకం కింద ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణం అమలవుతోంది. బ్యాంకు లింకేజీ రుణాలను వడ్డీ రాయితీని అందిస్తున్నారు. ఈ రెండు కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం గడచిన నెలలో మహాలక్ష్మి సంబురాలను నిర్వహించింది. కానీ ఆసరా పింఛన్ పొందని గృహిణులకు మహాలక్ష్మి పథకం కింద రూ.2,500ల సాయం అందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆదేశాలు అందాల్సి ఉంది..

మహాలక్ష్మి పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేసే విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ప్రజాపాలనలో అనేక మంది దరఖాస్తులు అందించగా వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉంచాం. లబ్ధిదారులుగా ఎవరు అర్హులు, వారిని ఎలా గుర్తించాలి అనే విషయంలో ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు రాలేవు. తొందరలోనే మార్గదర్శకాలు జారీ కావచ్చు.

– తిరుమల, ఎంపీడీవో, మోర్తాడ్

బొప్పాయిల వ్యాన్ బోల్తా



నేలపాలైన బొప్పాయి కాయలు



బొప్పాయిలను తీసుకెళ్తున్న ప్రజలు

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ శివారులోని జాతీయ రహదారి 44పై బొప్పాయి పండ్ల వ్యాన్ బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి రాజస్థాన్ వెళ్తున్న బొప్పాయి పండ్ల డీసీఎం వ్యాన్ శుక్రవారం మధ్యాహ్నం వర్షం కారణంగా హైవేపై అదుపు తప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. బొప్పాయి పండ్లు కింద పడిపోవడంతో జనాలు పండ్ల కోసం ఎగబడ్డారు. కొందరు బస్తాల్లో ఎత్తుకెళ్లారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



మద్నూర్(జుక్కల్): మండలంలోని సుల్తాన్‌పేట్‌లో శనివారం విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందినట్లు పంచాయతీ కార్యదర్శి సంజయ్ తెలిపారు. విద్యుత్ తీగల కింద గేదె మేత మేస్తుండగా విద్యుత్ తీగలు తెగి గేదెపై పడ్డాయి. దీంతో గేదె కరెంట్‌షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. కళేబరానికి పంచనామ నిర్వహించి మేనూర్ విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈకి సమాచారం అందించినట్లు ఆయన వెల్లడించారు.

దాబాపై పోలీసుల దాడి

ఎల్లారెడ్డి: మండలంలోని లక్ష్మాపూర్ శ్రీమాతా దాబాపై శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. దాబాలో మద్యం తాగేందుకు అనుమతిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. దాబా యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేని దాబాలలో మద్యం సేవించ వద్దని ఎస్సై మద్యం ప్రియులకు సూచించారు.

క్రైం కార్నర్

నీటి గుంతలో పడి ఒకరి మృతి



పురేందర్ గౌడ్ (ఫైల్)

ఇందల్వాయి: మండలంలోని గన్నారం గ్రామ శివారులోగల రోడ్డు పక్కన ఉన్న నీటి గుంతలో పడి ఒకరు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన పురేందర్ గౌడ్(52) గతంలో ఉపాధి కోసం వైన్ షాపుల్లో, కల్లు బట్టీల్లో పని చేసేవాడు. ప్రస్తుతం ఉపాధి లేకపోవడతో పని కోసం వెతుకుతున్నాడు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి అతడు ఇందల్వాయి నుంచి సిర్నాపల్లి వైపు నడుచుకుంటూ బయలుదేరాడు. గన్నారం గ్రామ శివారులోగల రోడ్డు పక్కన ఉన్న నీటి గుంతలో అతడు ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..



కనకం అనిల్(ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మోర్తాడ్‌కు చెందిన కనకం అనిల్(31) ఈనెల 4న బంధువులను కలవడానికి బైక్‌పై శెట్‌పల్లి గ్రామానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి బయలుదేరగా, పాలెం సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతలో పడి, తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆర్మూర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మరణించాడు. మృతదేహానికి శనివారం ఆర్మూర్ ఆస్పత్రిలో పోసుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు. మృతుడికి తల్లి, భార్య, ఒక కొడుకు, కూతురు ఉన్నారు.

బీబీపేట మండలంలో ఒకరు..



నారాయణ (ఫైల్)

బీబీపేట: ఇటీవల ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు ఇలా.. బీబీపేట గ్రామానికి చెందిన పోసు నారాయణ (65) గత మూడేళ్లుగా అల్సర్‌తో బాధపడుతుండేవాడు. ఎన్ని ఆస్పత్రుల్లో చూపించినప్పటికీ వ్యాధి నయం కాలేదు. దీంతో అతడు జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి గడ్డి మందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి చనిపోయాడు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పెద్ద చెరువులో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు దేవునిపల్లి పోలీసులు శనివారం తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో మూడు రోజుల క్రితం చెరువులో పడి చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయస్సు 25 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందని ఎస్సై రంజిత్ తెలిపారు.

పేకాడుతున్న 10మంది అరెస్టు


ఎల్లారెడ్డి: మండలంలోని వెల్లుట్లపేట శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం రావడంతో శుక్రవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాడుతున్న పది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై మహేష్ శనివారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.43,150ల నగదు, 10 సెల్‌ఫోన్లు, 11 బైకులు సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. మరో నలుగురు పరారైనట్లు ఆయన తెలిపారు.

గుంతలో దిగపడిన లారీ



నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో ఓ లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన గుంతలో దిగబడిపోయింది. మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతుండగా రహదారి పక్కన గుంతలు తవ్వా రు. ఈక్రమంలో శుక్రవారం మండల కేంద్రంలోని సమీకృత భవనం ఎదురుగా వర్ని వైపునకు వెళుతున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో దిగిపోయింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనుల నేపథ్యంలో హెచ్చరిక బోర్డులు, బార్డర్ లైన్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



నిజామాబాద రూరల్: మండలంలోని మాధవనగర్ పరిధిలో వీధి కుక్కల దాడిచేయడంతో ఓ బాలుడికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. మాధవనగర్ మూడో డివిజన్‌కు చెందిన సుశాంత్ అనే ఐదేళ్ల బాలుడు శనివారం ఇంటి బయట ఆడుకుంటున్నాడు. వీధికుక్కలు ఒక్కసారిగా బాలుడిపై దాడి చేశాయి. దీంతో బాలుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుక్కలను తరిమివేసి, బాలుడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

సమాన పనికి సగం వేతనం!

- మినీ అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేసినా పాత జీతాలే అందిస్తున్న ప్రభుత్వం
- తీవ్రంగా నష్టపోతున్న అప్‌గ్రేడ్ అయిన అంగన్‌వాడీ టీచర్లు

మోర్తాడ్(బాల్కొండ):మినీ అంగన్‌వాడీ నుంచి మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా అప్‌గ్రేడ్ అయినా వారికి ప్రభుత్వం పాత వేతనాలనే అందిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మెయిన్, మినీ అంగన్‌వాడీల్లో చేసే పనిలో తేడా ఏమి లేకపోయినా వేతనం విషయంలోనే తమకు అన్యాయం జరుగుతుందని, సమాన పనికి సగం వేతనమే పొందుతున్నామని మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు.

జిల్లాలో 1500 అంగన్‌వాడీ కేంద్రాలు..

జిల్లాలో 1,500 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 1,145 మంది కార్యకర్తలను మెయిన్‌గా, 135 మందిని మినీ అంగన్‌వాడీలుగా గుర్తింపునిచ్చారు. మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ. 13,500ల వేతనం, మినీ అంగన్‌వాడీలకు రూ.7,500ల వేతనం చెల్లించేవారు. అనేకమార్లు అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళనలు నిర్వహించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం గత జనవరిలో మినీ అంగన్‌వాడీ కార్యకర్తలను అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. పెంచిన వేతనం ఇతర సౌకర్యాలను మాత్రం ఏప్రిల్ 2024 నుంచి వర్తింపచేయనున్నట్లు పేర్కొంది. దీంతో ఏప్రిల్, మేలో అప్‌గ్రేడ్ అయిన అంగన్‌వాడీ టీచర్లకు రూ.13,500ల వేతనం అందింది. ఆ తర్వాత నుంచి పాత లెక్కల ప్రకారం సగం వేతనమే ఖాతాల్లో జమ చేశారు. ట్రెజరీలో సాంకేతిక సమస్యలతోనే పాత వేతనం జమ అవుతుందని అధికారులు వెల్లడించారు. సమస్యను పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరినా ప్రయోజనం లేకపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పనికి తగిన వేతనం చెల్లించే ఏర్పాట్లు చేయాలని అప్‌గ్రేడ్ అయిన అంగన్‌వాడీ టీచర్లు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరించాలి..

మినీ అంగన్‌వాడీ కార్యకర్తలను అప్‌గ్రేడ్ చేసినా పాత వేతనమే చెల్లిస్తున్నారు. ట్రెజరీలోని సాంకేతిక సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలి. సమస్యపై అధికారులకు ఎన్నోమార్లు వినతి పత్రాలను అందించాం. ప్రభుత్వం చొరవ తీసుకుని సిబ్బందికి న్యాయం చేయాలి.

– దేవగంగు, అంగన్‌వాడీ కార్యకర్తల అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు

ఉన్నతాధికారులకు విన్నవించాం

అప్‌గ్రేడ్ చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలకు మొదట్లో రెండు నెలలు కొత్త వేతనం మంజూరు చేశారు. ఆ తరువాత సాంకేతిక సమస్య ఉత్పన్నం కావడంతో పాత వేతనమే లభిస్తుంది. ఉన్నతాధికారులకు ఈ సమస్యను విన్నవించాం. త్వరలోనే సమస్య పరిష్కారం కానుంది.

– రసూల్‌బీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి

చికిత్స పొందుతూ ఒకరి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆస్పత్రి ఎదుట మృతుడి కుటుంబీకుల ఆందోళన



సాయికుమార్ (ఫైల్)

నిజామాబాద్‌నాగారం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందాడని మృతుడి కుటుంబీకులు ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. వివరాలు ఇలా.. ఆర్మూర్ ప్రాంతానికి చెందిన సాయికుమార్(26) మెడికల్ రిప్రజంటేటివ్‌గా పనిచేస్తుండేవాడు. అతడు శనివారం హైదరాబాద్ నుంచి ఆర్మూర్‌కు కారులో బయలుదేరగా, కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లి హైవే వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనలో అతడు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ప్రుడెన్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి ఆస్పత్రిలో మృతిచెందాడు. విషయం తెలిసిన కుటుంబసభ్యులు వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మృతిచెందినట్లు ఆరోపించారు. ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు, బంధువులు, మెడికల్ రిప్రజంటేటివ్ సంఘం సభ్యులు ధర్నా చేపట్టారు. వీరికి మద్దతుగా సీఐటీయూ నాయకులు నూర్జహాన్, మానవ హక్కుల సంఘం అధ్యక్షులు రషీదాభేగం, టీడీపీ అధికార ప్రతినిధి పురుషోత్తం, మెడికల్ రిప్రజంటేటివ్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ ఆస్పత్రికి చేరుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



నగరంలోని ఆస్పత్రి ఎదుట నిరసన చేస్తున్న మృతుడి కుటుంబీకులు